క్లుప్తంగా

ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడిగా రంగారెడ్డి



రంగారెడ్డిని సత్కరిస్తున్న పెన్షనర్ల సంఘం ప్రతినిధులు

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రంగారెడ్డి ఎన్నికయ్యారు. ఈ సంఘం ఎన్నికల ప్రక్రియ కాకినాడలో జరిగింది. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా నుంచి రంగారెడ్డికి రాష్ట్ర సంఘంలో ప్రాతినిధ్యం లభించింది. విశ్రాంత సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అయిన రంగారెడ్డి ప్రస్తుతం జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులు కావడంతో సంతోషం వ్యక్తం చేస్తూ పెన్షనర్ల సంఘం నేతలు సోమవారం ఆయనను సత్కరించారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న సందేల్ చంద్రశేఖర్

కర్నూలు కల్చరల్: బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తామని, అర్చక, పురోహితులకు అండగా నిలుస్తామని బ్రాహ్మణ సంక్షేమ వేదిక రాయలసీమ జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సందేల్ చంద్రశేఖర్ అన్నారు. హైదరాబాద్ ఉప్పల్‌లోని ఎమ్ కన్వెన్షన్ సెంటర్‌లో బ్రాహ్మణ సంక్షేమ వేదిక తృతీయ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తుందన్నారు. వారసత్వ హక్కును కల్పించడం, అర్చక పురోహితులకు పదవీ విరమణ వయసును మినహాయింపు ఇవ్వడంతో వారి కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం వేదిక వ్యవస్థాపకులు బాలా శ్రీనివాస్, బిర్లా మందిరం ప్రధాన అర్చకులు లక్ష్మీ నరసింహ స్వామి శర్మలు సందేల్ చంద్రశేఖర్‌ను సన్మానించారు.

మతసామరస్యాన్ని చాటాలి



సదస్సుకు హాజరైన మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రహ్మణ్యం

కర్నూలు (టౌన్) : గాంధీ స్ఫూర్తితో మతసామరస్యాన్ని చాటాలని మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి స్థానిక లలిత కళాసమితిలో 'వర్తమాన పరిస్థితులు – మతసామరస్యం – ఆవశ్యకత' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి సంబంధించిన స్పష్టత ప్రజల్లో ఉండాలన్నారు. కొందరిలో దేశాన్ని నిట్టనిలువున చీల్చాలనే ధోరణి వచ్చిందన్నారు. మతతత్వ శక్తులు అన్ని రంగాల్లో చొరబడి ప్రజల్లో ద్వేషాన్ని రగిలిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ, రవీంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ పుల్లయ్య, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కో–కన్వీనర్ ప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి నిత్యావసరాల పంపిణీ

కర్నూలు (టౌన్): స్థానిక బుధవారపేటలోని సెరూడ్స్ అనాథాశ్రమంలో పిల్లలకు సోమవారం మిలీనియం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్, సభ్యులు మణి మంజుల, సుజాన్‌గ్రేస్, హనోక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కర్నూలు సిటీ: సి.బెళగల్ మండల కేంద్రానికి చెందిన వైఎస్‌ఆర్‌సీపీ కార్యకర్త సురేష్ సతీమణి మరియమ్మ సోమవారం అనారోగ్యంతో పెద్దాసుపత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ హాస్పటల్‌కి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై అక్కడి డాక్టర్లను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

'సుంకేసుల'కు 3,950 క్యూసెక్కుల ఇన్ ఫ్లో



గూడూరు: సుంకేసుల జలాశయానికి సోమవారం 3,950 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యామ్‌కు ఒక గేట్‌ను అర మీటరు మేర ఎత్తి 2,264 క్యూ సెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కేసీ కాల్వకు 1,616 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు వారు పేర్కొన్నారు. డ్యాంలో 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



జిల్లా గ్రంథాలయ సంస్థలో మహాత్ముడికి నివాళి



జిల్లా పరిషత్‌లోని గాంధీ విగ్రహం వద్ద ..



క్లస్టర్ యూనివర్సిటీలో ..



నివాళులర్పిస్తున్న మాంటిస్సోరి స్కూల్ సిబ్బంది



ఆసుపత్రిలో చీపుర్లు పట్టి శుభ్రం చేస్తున్న అధికారులు

బాపూజీ అనుసరణీయులు

- గాంధీజీ ఆశయాల సాధనకు కృషి చేద్దాం
- జాతిపిత జయంతి వేడుకల్లో వక్తలు
- మహనీయుడికి ఘన నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- బిర్లాగడ్డ వద్ద దండిమార్చ్ విగ్రహా విష్కరణ



జాతిపితకు నివాళి.. కలెక్టరేట్ గాంధీ విగ్రహం వద్ద ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యేలు కాటసాని, సుధాకర్, మేయర్ బీవై రామయ్య, జేసీ మౌర్య, కమిషనర్ భార్గవ్‌తేజ తదితరులు

కర్నూలు (టౌన్): జాతిపిత మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడిచి ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పిలుపునిచ్చారు. సోమవారం గాంధీ జయంతి వేడుకలు నగరంలో ఘనంగా జరిగాయి. స్థానిక బిర్లాగడ్డ వద్ద నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దండి మార్చ్ (ఉప్పు సత్యాగ్రహం) విగ్రహాలను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సుధాకర్, మేయర్ బీవై రామయ్య, జేసీ నారపురెడ్డి మౌర్య, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ 1930వ సంవత్సరంలో గాంధీజీ ఉప్పు సత్యాగ్రహం ద్వారా దేశ ప్రజలను ఏకం చేశారన్నారు. ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా ఈ ఉద్యమం సాగిందన్నారు.అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్య్రం తీసుకొచ్చిన జాతి పిత ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయులన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకోవాలన్నారు. అంతకు ముందు వారు జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్ రెడ్డి, కార్పొరేటర్లు శ్రీనివాసరావు, శ్వేతా రెడ్డి, సిట్రా సత్యనారాయణమ్మ, కైపా పద్మాలత, విజయలక్ష్మి, నీలోఫర్, జుబేర్, ఆర్షియా పర్వీన్, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, షేక్ పర్వీన్ జబీనా వివిధ సంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు, మాంటిస్సోరి విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం

జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారం చేశారని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. స్థానిక బిర్లాగడ్డ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన దండిమార్చ్ విగ్రహాలను ఆయన సందర్శించి మాట్లాడారు. ఉప్పుపై పన్నును వ్యతిరేకిస్తూ నాడు గాంధీజీ 384 కిలో మీటర్లు పాదయాత్ర చేశారన్నారు.

• నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మేనేజర్ చిన్నరాముడు సిబ్బంది పాల్గొన్నారు.

• స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో స్టేడియం సీఈఓ రమణ, చీఫ్ కోచ్ శ్రీనివాసరావు, స్టేడియం సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీలో..

కర్నూలు(అర్బన్): మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్‌లోని మహాత్ముని విగ్రహానికి జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డితో పాటు జెడ్పీలోని వివిధ విభాగాలకు చెందిన పర్యవేక్షకులు, ఉద్యోగులు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ సీసీ అశ్వినీకుమార్, కార్యాలయ పర్యవేక్షకులు బసవశేఖర్, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

• జిల్లా పరిషత్ ప్రాంగణంలోని పీఆర్ పర్యవేక్షక ఇంజినీరు కార్యాలయంలో సోమ వారం మహాత్మా గాంధీ 154వ జయంతి కార్యక్ర మాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ కె. సుబ్రమణ్యం, పీఐయూ ఈఈ రామక్రిష్ణారెడ్డి, డీఈఈలు బి. శ్రీనివాసులు, నాగి రెడ్డి, పీఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్రరెడ్డి, ఆర్ సతీష్‌కుమార్‌తో పాటు పలువురు ఇంజనీర్లు పాల్గొన్నారు.

• కర్నూలు సిటీ: పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో సంఘం నాయకులు శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరయ్య, వీరారెడ్డి, నర్సయ్య, రమణ, మల్లికార్జునరెడ్డి, వరప్రసాద్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో..

కర్నూలు (సిటీ/న్యూసిటీ) : డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన గాంధీ జయంతిలో రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జేఎండీ.షఫీ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

• గాంధీ జయంతిని పురస్కరించుకుని ఏపీఎస్‌పీ బెటాలియన్ క్యాంప్‌లోని కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగర పాలక ఉన్నత పాఠశాలలో ఎస్‌బీఐ బ్యాంకు సౌజన్యంతో సోమవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. బ్యాంక్ రీజినల్ మేనేజర్ సూర్య ప్రకాష్ రావు, చీఫ్ మేనేజర్ హెచ్. ఆర్ సి.వి.ఆర్ ప్రసాద్, బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాషా గాంధీ సేవలను కొనియాడారు.

• క్లస్టర్ యూనివర్సిటీలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో వర్సిటీ ఉపకులపతి ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ ఆచార్య డి.శ్రీనివాసులు గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేవీఆర్, సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీల ప్రిన్సిపల్స్ డా.ఇందిరాశాంతి, డా.వి.వి.ఎస్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

• ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీలో జరిగిన వేడుకల్లో కాలేజీ ప్రిన్సిపల్ ఎస్.నాగస్వామి నాయక్, స్థానిక మాధవీనగర్‌లోని నారాయణ స్కూల్‌లో జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో మహమ్మద్ అల్తాఫ్ జాతిపిత చిత్రపటాలకు పూలమాలలు వేశారు.

• గాంధీ జయంతిని పురస్కరించుకుని మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. గోశాలలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేశారు. పాఠశాల సిబ్బంది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతిపితకు ఘననివాళి

కర్నూలు(హాస్పిటల్):కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జాతిపిత మహాత్మా గాంధీకి ఘననివాళులు అర్పించారు. అనంతరం ఆసుపత్రిలోని సిబ్బందికి మిఠాయిలు, రోగులకు పండ్లు పంచి పెట్టారు. ఆ తర్వాత ఆసుపత్రి ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని వైద్యులు, నర్సింగ్ సిబ్బందితో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, ప్రొఫెసర్లు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ విజయానందబాబు, డాక్టర్ మహేశ్వరరెడ్డి, డాక్టర్ విద్యాసాగర్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సునీల్ ప్రశాంత్, నర్సింగ్ సూపరింటెండెంట్ వెంకట తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడి బాటలో నడుద్దాం

కర్నూలు కల్చరల్: గాంధీ చూపించిన మార్గం ప్రతి ఒక్కరూ అనుసరించదగ్గదని మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఆవరణలో గాంధీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీజీవీ ట్రేడ్ యూనియన్ నాయకులు బాలయ్య, పాల్‌రాజు, పలు విద్యా సంస్థల ఎన్సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

• జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, వైఎస్సార్‌సీపీ నాయకులు దేవ పూజ ధనుంజయ ఆచారి, యూనుస్ బాష, బత్తుల లక్ష్మీకాంతయ్య, రాజశేఖర్, తదితరులు గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేశారు.

విద్యుత్ భవన్‌లో ..

కర్నూలు(రాజ్‌విహార్): జాతిపిత గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి వేడుకలు సోమవారం స్థానిక విద్యుత్ భవన్‌లో ఘనంగా జరిగాయి. కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి వారి చిత్రాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

కర్నూలు(లీగల్) : న్యాయవాదుల సంఘం కార్యాలయంలో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల చిత్ర పటాలకు ఆ సంఘం అధ్యక్షుడు టి.నాగభూషణం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎం.వి.చక్రపాణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మహాత్ముడు చిరస్మరణీయుడు

- వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య



వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్/సెంట్రల్): దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహాత్మాగాంధీ చిరస్మరణీయులని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య అన్నారు. సోమవారం స్థానిక బిర్లా గేట్ వద్ద ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య కోసం మహాత్ముడు అలుపెరగని పోరాటం చేశారన్నారు. ఆయన కన్న కలలను రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారం చేశారన్నారు. అనంతరం పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతి, సాధికారత, సంక్షేమం, సంరక్షణ, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్‌పర్సన్ విజయ మనోహరి, పార్టీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, పద్మలతారెడ్డి, విజయలక్ష్మి, నాయకులు మహేశ్వరరెడ్డి, మద్దయ్య, సుభాష్ చంద్రబోస్, ధనుంజయ ఆచారి, సురేష్, యూనుస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

ఆంగ్లేయులను గడగడలాడించిన యోధుడు మహాత్మా గాంధీ అని డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకర బాబు అన్నారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన గాంధీ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

బీజేపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ హాస్టల్లో విద్యార్థులకు బిస్కెట్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమాజ సేవలో..



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న యంగమరాజు

కర్నూలు(హాస్పిటల్/కల్చరల్): గాంధీ జయంతిని పురస్కరించుకుని సోషల్ రిసోర్స్ పర్సన్ డి. యంగమరాజు సోమవారం స్థానిక బిర్లాగేట్‌లోని డాక్టర్ బ్రహ్మరెడ్డి ప్రజా వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సాయిప్రదీప్, రాజశేఖర్, గ్రేట్ విత్ గ్రీన్ వ్యవస్థాపకులు బి. శ్రీరాములు, సాయి, రాజు వివేకా పాల్గొన్నారు.

• లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు ఫోర్ట్ ఆధ్వర్యంలో నగరంలోని అంధుల పాఠశాలలో, మన వృద్ధుల ఆశ్రమంలో నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ లయన్ మెంబర్ ఎంజేఎఫ్ మాణిక్యప్రభు, లయన్ పీవీ రాజ్‌కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్, రీజనల్ చైర్‌పర్సన్ కేఈ.శివరామ్‌గౌడ్, రిటైర్డ్ డీఈ పి. వెంకటేశ్వర్లు, టీవీ. రమణగౌడ్, పీవీ రాజ్‌కుమార్, ఎం. రహమతుల్లా పాల్గొన్నారు.

• రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం శిల్పా టౌన్ షిప్‌లోని శ్రీ ఆదిశంకర తపోవనం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ జిల్లా అధికారి టీఎస్ విజయకుమార్, అధ్యక్షులు డాక్టర్ వాసు రెడ్డి, కార్యదర్శి అనిల్‌కుమార్, సభ్యులు రాజగోపాల్, వెంకటేశ్వర్లు, హనుమంతరెడ్డి, రామకృష్ణారెడ్డి, గోవర్ధన గిరి తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

ముగిసిన రగ్బీ చాంపియన్‌షిప్ పోటీలు



రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో రన్నర్‌గా నిలిచిన కర్నూలు బాలుర జట్టు

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా ప్రాంగణంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి రగ్బీ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో బాలుర జూనియర్ విభాగంలో నెల్లూరు జట్టు, బాలికల విభాగంలో అనంతపురం జట్టు విజేతలుగా నిలిచాయి. విజేత జట్లకు కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల వ్యవస్థాపకులు కేవీ సుబ్బారెడ్డి, వైద్యులు డాక్టర్ శంకర్ శర్మ బహుమతులు, కప్‌లు, ప్రశంసాపత్రాలు అందజేశారు. బాలుర విభాగంలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నెల్లూరు, కర్నూలు, అనంతపురం జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో అనంతపురం, కర్నూలు, గుంటూరు జట్లు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు గుడిపల్లె సురేందర్, రామాంజనేయులు, విజయ్‌కుమార్, సౌత్ ఇండియా ఇంచార్జీ నోయల్ , నాగరత్నమయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలి

స్కూల్‌గేమ్స్ క్రీడా పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని నగర మేయర్ బీవై.రామయ్య, విద్యా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శామ్యూల్ పాల్ అన్నారు. సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్) : స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో సోమవారం జిల్లా స్థాయి తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను మేయర్ బీవై రామయ్య ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సుందర రాజు, శిక్షకులు సుజన్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



అవగాహన సదస్సులో సంఘం సభ్యులు

కర్నూలు కల్చరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వక్తలు పిలుపునిచ్చారు. సోమవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో రాయల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ మహిళలు సంఘటితంగా సమస్యలపై పోరాటం చేయాలన్నారు.సమాజాభివృద్ధిలో ప్రధాన భూమిక పోషించాలన్నారు. చట్ట సభల్లో మహిళల రిజర్వేషన్‌కు సంబంధించిన బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించడం శుభపరిణామమన్నారు. విద్యానగర్ మాంటిస్సోరి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత, రాయలసీమ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సునీత, కేవీఆర్ కళాశాల అధ్యాపకురాలు లత, ఉపాధ్యాయులు పసుపులేటి నీలిమ, సుజాత, జ్యోతి, సుధాభారతి మాట్లాడారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాస్ వారిని సన్మానించారు. విద్యార్థుల విచిత్ర వేష ధారణ, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

మహాత్ముడిని మరిచారు



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పూజ్య మహాత్మాగాంధీని మరిచారు. గాంధీ జయంతి రోజు కార్యాలయ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి ఒక్క అధికారి కూడా వచ్చి పూల మాల వేసి నివాళ్లు అర్పించలేకపోయారు. సోమవారం సెలవు రోజు కావడంతో కార్యాలయానికి అధికారులు ఎవ్వరూ హాజరుకాలేదు. జాతీయ పర్వదినాల్లో అధికారులు కార్యాలయానికి వచ్చి కార్యక్రమం నిర్వహించి వెళ్తారు. కానీ ఈ సారి అధికారులు ఒక్కరూ వచ్చి గాంధీ విగ్రహానికి పూలమాల వేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. – కర్నూలు(హాస్పిటల్)

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

కల్లూరు: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) నాగరాజు నాయుడు అన్నారు. నెరవాడ గ్రామంలో సర్పంచ్ మధన్‌గోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు జిల్లా పంచాయతీ అధికారితో పాటు డీఎల్‌పీఓ తిమ్మక్క హాజరయ్యారు. డీపీఓ మాట్లాడుతూ గ్రామంలో జరిగిన ఆర్థికేతర అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు. బాలికా విద్య ప్రాముఖ్యతను వివరించి ప్రతి ఇంట్లో బాలికలు చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. బాల్యంలో వివాహం చేయడంలో మానసికంగా, శరీరకంగా అనేక సమస్యలు ఉత్పన్నమవుతయన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించి, గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.

క్రైం కార్నర్

ఆదిత్య నగర్‌లో చోరీ

కర్నూలు : నగర శివారులోని ఉల్చాల రోడ్డులో ఉన్న ఆదిత్య నగర్‌లో పట్టపగలే దొంగలు ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. మెకానిక్‌గా పనిచేస్తున్న మహబూబ్ ఆదిత్య నగర్‌లో నివాసముంటాడు. ఆదివారం ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి హైదరాబాదు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి అందిన మట్టుకు మూటగట్టుకుని ఉడాయించాడు. మహబూబ్ రాత్రి ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరచి ఉండటంతో ఆందోళనకు గురై గదిలోకి వెళ్లి చూడగా బీరువాలోని సామాన్లన్నీ చిందరవందరగా పడివున్నాయి. చోరీ జరిగిందని నిర్ధారించుకుని సోమవారం నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 12 తులాల బంగారం, 75 తులాల వెండి, రూ.1.50 లక్షల నగదు చోరీకి గురైనట్లు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ఆసుపత్రి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నూతన కార్యవర్గ సభ్యులతో అబ్రహాం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జి. అబ్రహాం కోరారు. సోమవారం ఆసుపత్రిలోని కార్యాలయంలో సదరు యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అబ్రహాం మాట్లాడుతూ పడకల సంఖ్య ఆధారంగా ఎఫ్ఎన్ఓ, ఎంఎన్‌వో పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షుడిగా ఎన్. బాలుస్వామినాయక్, ఉపాధ్యక్షులుగా పి. వెంకట ఆదినారాయణ, కె. సుశీలమ్మ, పి. హరిశ్చంద్రనాయుడు, ఎస్. మల్లికార్జున, ఏ.శేషిరెడ్డి, బ్రాంచ్ కార్యదర్శిగా ఎస్. ఖాజా మొహిద్దీన్, సంయుక్త కార్యదర్శిగా ఎం. రమేష్, ఎస్.భాగ్యమ్మ, గీత కళ్యాణి, డి. సుందర్‌రాజు, కోశాధికారిగా కె. సురేష్‌తో పాటు మరో 11 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సంక్షిప్తం

8న సాహితీ సదస్సు

కర్నూలు కల్చరల్: సాహితీ సదస్సు ఆధ్వర్యంలో శ్రీశైలం అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదానం సత్రం, నివృత్త భూగర్భ జలశాఖ విశ్రాంత అధికారి ముచ్చుకోట చంద్రశేఖర్ సౌజన్యంతో ఈనెల 8న గ్రంథాలయ తాతయ్య ముచ్చుకోట వెంకటరామయ్య జయంత్యుత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సదస్సు కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ తెలిపారు. ఉదయం 10 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ఈ సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు.

కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు(సెంట్రల్): కుల వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) ఆవిర్భావించి 24 ఏళ్లు కావడం ఆనందంగా ఉందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనందబాబు పేర్కొన్నారు. సోమవారం ఆ సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారపేటలోని సంఘం కార్యాలయంలో కేవీపీఎస్ జెండాలు ఆవిష్కరించారు. జొహరాపురంలో కేవీపీఎస్ ఆవిర్భావ వేడుకలు నాయకుడు కృష్ణ అధ్యక్షతన జరగగా ఆర్.రమణ, రంగస్వామి, నాగరాజు, దాసులు జెండాలను ఆవిష్కరించారు.

మహిళా సాధికారతతోనే అభివృద్ధి

కర్నూలు(సెంట్రల్) : మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ జాతీయ ఓబీసీ కోఆర్డినేటర్ నాగరాజు సావర్కార్ అన్నారు. సోమవారం కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఓబీసీ విభాగం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరరాబు, నాగమధుయాదవ్ పాల్గొన్నారు.

ఖండేరి సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): నగర పాలక సంస్థ పరిధిలోని ఒకటో వార్డు ఖండేరిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకుడు ఎం.షరీఫ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ పార్టీ నాయకులు వార్డులో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వీధిలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, తక్షణమే మునిసిపల్ అధికారులు స్పందించి వాటిని తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. జగన్నాథం సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఇందుకోసం సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో 4న జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

పెండింగ్ జీతాలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): స్థానిక మునిసిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ నాయకులు ఆర్.నరసింహులు, డి.అబ్దుల్‌దేశాయ్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకున్న, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనందబాబు, వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ గురుశేఖర్ తదితరులు గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

సంక్షేమ బోర్డు ద్వారా ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులను ఆదుకోవాలని ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు ఎం.విజయ్ డిమాండ్ చేశారు. సోమవారం జొహరపురంలో ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించి మాట్లాడారు.